

మల్లక్‌పల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

# కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కులేదు

- వారి హామీల్లో నిజాయితీ లేదు
- ఎన్నికల కోసమే మోసపూరిత వాగ్దానాలు
- తెలంగాణకు సీఎం కేసీఆరే శ్రీరామరక్ష
- గెలిచిన తర్వాత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..
- ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి
- మల్లక్‌పల్లి, ధర్మాపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం

ధర్మసాగర్, అక్టోబర్ 12 : కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాల్లో నిజాయితీ లేదని, ఆ పార్టీకి ఓటు అడిగే హక్కే లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మల్లక్‌పల్లె, ధర్మపురం గ్రామాల్లో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల్లో నిజాయితీ లేదన్నారు. ఉంటే పక్కన కర్ణాటక రాష్ట్రంలో అవి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అక్కడ అమలు చేయలేని పథకాలను ఇక్కడ మాత్రం ఓట్ల కోసం మేము ఇస్తామని హామీలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కర్ణాటకలో పింఛన్లు రూ.1200 మాత్రమే ఇస్తున్నారన్నారు. కానీ, మన రాష్ట్రంలో రూ. 2 వేలు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతి, అక్రమాలు, స్కామ్‌లు, దోచుకోవడం, దాచుకోవడం అని అన్నారు. ఇక బీజేపీకి పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తొమ్మిదేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో పని చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం చిన్నది అయిన పెద్ద మనసుతో సీఎం కేసీఆర్ పని చేస్తూ దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రజలందరూ సమష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని కోరారు. తనకు ఎమ్మెల్యే రాజయ్యకు మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. త్వరలోనే జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి ఇద్దరం ఎన్నికల ప్రచారం చేస్తామని తెలిపారు. తనకు వ్యక్తిగత ఎజెండా లేదని, నియోజకవర్గం అభివృద్ధే ఎజెండా అని అన్నారు. నన్ను నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేస్తానన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు దీటుగా స్టేషన్‌ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఈ నియోజవర్గంలో చేసిన అభివృద్ధి పనులు ప్రజల ముందు కండ్లకు కనిపిస్తున్నాయని గుర్తు చేశారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని, మీ ఆత్మగౌరవం పెంపొందించేలా పని చేశానన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు రాజకీయ జన్మనిచ్చారన్నారు. ఒక్క అవకాశం ఇవ్వాలని, నిండు మనసుతో తనను ఆశీర్వాదించాలని కోరారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ జీ రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లక్‌పల్లె సర్పంచ్ మునిగెల రాజు ముదిరాజ్, జడ్పీటీసీ డాక్టర్ పిట్టల శ్రీలత, ధర్మపురం సర్పంచ్ మునిగాల యాకోబ్, ఎంపీటీసీ భీంరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కరంచంద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదకుమార్, మాజీ సర్పంచ్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్, బాలస్వామి, కరుణాకర్ రెడ్డి, పిట్టల సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

## ప్రజారోగ్యానికి సీఎం కేసీఆర్ పెద్దపీట

**ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**

గిర్మాజీపేట, అక్టోబర్ 12 : ప్రజారోగ్యానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. గ్రేటర్ 40వ డివిజన్‌లో సాయికృష్ణ, వనమ్మ అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొంది, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కులను గురువారం ఎమ్మెల్సీ మండిబజార్‌లోని తన ఇంటి ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఓ వరంలా మారిందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ప్రశంసించారు. వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు భారం కావొద్దని ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ), వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ప్రజలు ఎల్‌వోసీ, సీఎంఆర్‌ఎఫ్ వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు గౌతమ్ ఉన్నారు.

# కనుమరుగవుతున్న పండుగలకు పూర్వ వైభవం

**చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



తారా గార్డెన్ వద్ద బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలతో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, అక్టోబర్ 12 : కనుమరుగవుతున్న పండుగలకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పూర్వ వైభవం తీసుకువస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైన పండుగల్లో బొడ్డెమ్మ పండుగ ఒకటన్నారు. బొడ్డెమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి హౌసింగ్ బోర్డు కాలనీ, తారా గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. బొడ్డెమ్మ నవరాత్రుల సందర్భంగా మహిళల ఆహ్వానం మేరకు ఉత్సవానికి హాజరై మహిళలకు, చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చీఫ్ విప్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న బతుకమ్మ పండుగను కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నామన్నారు. తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మ పండుగను చేసుకుని, అనంతరం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ సుపరిపాలనలో అన్ని పండుగలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయని చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

# బీఆర్‌ఎస్ సారథులు

- నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల నియామకం
- మొదటి విడుత జాబితాను ప్రకటించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- జనగామకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు
- వరంగల్ తూర్పునకు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్
- ములుగుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మహబూబాబాద్‌కు మంత్రి సత్యవతి రాథోడ్, ఇల్లందుకు ఎంపీ వద్దిరాజు

వరంగల్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పలు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించింది. తొలి విడతతో జనగామ, వరంగల్ తూర్పు, మహబూబాబాద్, నర్సంపేట, భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు గురువారం ప్రకటించారు. జనగామకు మంత్రి టీ హరీశ్‌రావు, రైతు బంధు సమితి చైర్మన్ టీ రాజయ్య, బోడకుంటి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్‌కు మంత్రి సత్యవతి రాథోడ్, ములుగుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ తూర్పు సెగ్మెంట్‌కు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, నర్సంపేటకు రాష్ట్ర నీటివనరుల సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్, ఇల్లందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలం ఎమ్మెల్సీ తాతా మధు, మంథనికి ఈత శంకర్‌రెడ్డిని నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమితులైన ఇన్‌చార్జిలపై ఇప్పటినుంచే పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ, కార్యక్రమాలను చేపట్టాల్సిన బాధ్యత ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఆయా నియోజకవర్గాల సంపూర్ణ బాధ్యతను వీరు తీసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులందరినీ సమన్వయం చేసుకొని ప్రచార బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు.



ఎమ్మెల్యే గండ్రతో కలిసి మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సురేందర్

## మిట్టపల్లికి ఎన్నికల ప్రచార బాధ్యతలు

**ఎమ్మెల్యే గండ్రతో కలిసి మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సురేందర్**

టేకుమట్ల, అక్టోబర్ 12 : టేకుమట్ల మండలం వెల్లంపల్లికి చెందిన సినీగేయ రచయిత మిట్టపల్లి సురేందర్‌కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ హాజరయ్యే ఎన్నికల ప్రచార సభల్లో పాటలు పాడే బాధ్యతలను మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో అప్పగించినట్లు మిట్టపల్లి మిత్రమండలి సభ్యులు అందె కుమార్, సతీశ్, పాల శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎన్నికలు అయిపోయే వరకు మిట్టపల్లి తన కళాబృందంతో ఆట, పాటలతో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే గండ్రకు మిట్టపల్లి ధన్యవాదాలు తెలిపారు.

## ములుగు డీఏవోకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డు



సునీల్ గవాస్కర్ నుంచి అవార్డును అందుకుంటున్న గౌస్‌హైదర్

ములుగు, అక్టోబర్12(నమస్తేతెలంగాణ) : జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న కేఏ గౌస్‌హైదర్ 31 ఏండ్లుగా కరౌకే సంగీతంలో ప్రదర్శనలు చేసినందుకు ఇండియా ఎక్సలెన్స్ అవార్డును ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో గౌస్‌హైదర్‌కు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992 నుంచి కరౌకే సంగీతంలో ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా కరౌకే సంగీతంలో అంధ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైమ్‌టైమ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.